
నేటి దినపత్రిక
18వ వసంతంలోకి..
# సూర్య
www.suryaa.com
## ఎన్టీఆర్ - కృష్ణా
ఆదివారం 2 ఫిబ్రవరి 2025 పేజీలు 8

## నూతన డీజీపీని కలిసిన కృష్ణాజిల్లా ఎస్పీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన హరీష్ కుమార్ గుప్తాని మంగళగిరి రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా ఎస్పీ, డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



### ఉపాధ్యాయుల చేతుల్లోనే...
# విద్యార్థుల భవిష్యత్తు

**పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషిచేయాలి : ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా**

విజయవాడ బ్యూరో, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ : ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని.. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ గౌరవ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు. స్థానిక పటమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్

మిగతా 2లో...

## పటిష్ట పర్యవేక్షణతో సజావుగా పెన్షన్ల పంపిణీ



### పెన్షన్లు పంపిణీ ప్రక్రియ
## త్వరగా పూర్తి చేయండి





వివరాలు 8లో



## 5న ఫీజ్ పోరును జయప్రదం చేయండి

**గోడ పత్రికను ఆవిష్కరించిన మాజీ మంత్రి వెలంపల్లి**

**పాల్గొన్న నగర మేయర్, పశ్చిమ నియోజకవర్గ వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు**

**విజయవాడ పశ్చిమ, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 5న జరిగే ఫీజ్ పోరును జయప్రదం చేయాలనీ కోరుతూ శనివారం నాడు మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు బ్రాహ్మణ వీధిలో గల తన కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం

మిగతా 2లో...




### పటిష్ట సమన్వయంతో..
# మేరీ మాత ఉత్సవాలను విజయవంతం చేద్దాం

- సీసీ కెమెరాలు, డ్రోన్లతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు
- తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణాపై ప్రత్యేక దృష్టి
- మూడు షిఫ్టుల్లో సిబ్బందితో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చేలా ఏర్పాట్లు
- విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత

## ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోండి

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు

వివరాలు 2లో



## మేరీమాత ఉత్సవాల ఏర్పాట్లలో

# ఎటువంటి లోపం లేకుండా చూసుకోండి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 9, 10, 11వ తేదీల్లో జరిగే గుణదల మేరీ మాత ఉత్సవాలలో విజయవాడ నగరపాలక సంస్థ వారు చేసే ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని




కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా బెత్లెహేమ్ నగర్, ఏలూరు రోడ్ ప్రాంతాలు పర్యటించి క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, తాగునీరు, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోటు లేకుండా చూసుకోవాలని, ఉత్సవాలకు వచ్చే మేరీ మత భక్తులకు విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే తాగునీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిత్యం పారిశుధ్య నిర్వహణ పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ వర్క్స్ పి సత్యనారాయణ, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెహికల్ డిపో యేసు పాదం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగానికి మరింత ఉత్తేజం ఇచ్చిన బడ్జెట్

**వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు**




**విజయవాడ, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని ఋజువయ్యిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ కేవలం ఒక తరగతికో వర్గమునకో పరిమితం కాకుండా అభివృద్ధి మరియు సంక్షేమ ములలో అన్ని వర్గాలను ముఖ్యముగా రైతులు ,మహిళలు ,యువత మరియు మధ్యతరగతి తదితర అన్ని వర్గాల అభివృద్ధి కేంద్రీకృత బడ్జెట్ గా నిలిచిందని తెలియచేసారు. ప్రతిపాదించిన రూ. 50,65,345లు కోట్ల రూపాయల బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి ?1,71,437 /- కోట్ల రూపాయలను కేటాయించి వ్యవసాయ రంగ కేంద్రీకృత బడ్జెట్ గా నిలిచి రైతుల మన్నలను పొందిందని తెలిపారు .ముఖ్యముగా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఋణ పరిమితి ని 3 లక్షల నుండి 5 లక్షలకు పెంచడం, పత్తి పంటలో నాణ్యమైన ఉత్పత్తి పెంచే దిశగా,మెరుగైన మార్కెటింగ్ ,గిట్టుబాటు ధరలు పొందేవిధముగా కాటన్ మిషన్ ఏర్పాటు చేయడం, అధిక దిగుబడులు నిచ్చే వంగడాల రూపకల్పన కు విత్తన జాతీయ మిషన్ ఏర్పాటు, మత్స్య సంపద అభివృద్ధికి మరింత చేయూత ఇవ్వటం ద్వారా రాష్ట్రములోని ఆక్వా రైతుల కు తోడ్పాటు కలిగిందని, కొత్తగా అస్సాం లో యూరియా ప్లాంట్ కు ఆమోదం ద్వారా యూరియా సరఫరా లో కొరతను తగ్గించే అవకాశం, మఖాన బోర్డు, ఇతర పరోక్ష గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించడం ద్వారా ప్రధాన మంత్రి వికసిత భారత్ సాధన లక్ష్యం కు మరింత దగ్గరయ్యిందని వ్యాఖ్యానించారు.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు





(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, విద్యాశాఖ అధికారులతో కలిసి పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధులను చేయాలని, పాఠ్యాంశాలపై పట్టు సాధించే దిశగా వారిని తీర్చిదిద్దాలన్నారు. సబ్జెక్టుల వారీగా అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించాలని, వైయక్తిక భేదాలను అనుసరించి విద్యార్థులపై శ్రద్ధచూపి ప్రత్యేకంగా బోధించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉపాధ్యాయులకు సూచించారు. ఛైర్మన్ వెంట పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీ శ, అడిషనల్ డైరెక్టర్లు మధుసూదన్ రావు, శ్రీనివాసరెడ్డి, డీఈవో యు.వి.సుబ్బారావు ఉన్నారు.

# పటిష్ట సమన్వయంతో మేరీ మాత ఉత్సవాలను విజయవంతం చేద్దాం



**విజయవాడ బ్యూరో, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** వివిధ శాఖల అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేసి వందేళ్ల ఘన ఆధ్యాత్మిక చరిత్రగల గుణదల మేరీమాత ఉత్సవాలను విజయవంతం చేద్దామని, ఈ నెల 9, 10, 11 తేదీల్లో పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత అన్నారు. శనివారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గుణదల మేరీమాత ఉత్సవాలపై రెవెన్యూ, పోలీస్, విజయవాడ నగరపాలక సంస్థ, వైద్య ఆరోగ్యం, ప్రజా రవాణా, విద్యుత్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డీవో కె.చైతన్య మాట్లాడుతూ కీలక సమయంలో దాదాపు ఆరు లక్షల మందికిపైగా భక్తులు రానున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకంగా నాలుగు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. మూడు షిఫ్టుల్లో సమన్వయ శాఖల సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజా రవాణా శాఖకు సూచించారు. రామవరప్పాడు రింగ్, చుట్టుగుంట వైపు నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని.. వాహనదారులకు ఉపయోగపడేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడికక్కడ తాగునీటి పాయింట్లు ఏర్పాటుచేయాలని ఇందుకు వీఎంసీ చర్యలు తీసుకోవాలని, గతేడాది కంటే మరింత బాగా ఏర్పాట్లు చేసి, భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూద్దామని ఆర్‌డీవో చైతన్య అన్నారు.

### ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఏర్పాట్లు

పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా భద్రత పరంగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీపీ కేజీవీ సరిత తెలిపారు. సీసీటీవీలు, డ్రోన్లతో సహా ఆధునిక సాంకేతికతను ఉపయోగించనున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చిన్నారుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటుచేసి నిరంతర పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా సమన్వయ శాఖల సహకారంతో మేరీమాత ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పోలీసు శాఖ కృషిచేయనున్నట్లు సరిత తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, సెంట్రల్ డివిజన్ ఏసీపీ కె.దామోదర్‌రావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, రెక్టార్ వై.జయరాజు, ఫాదర్ ప్రసాద్, ఫాదర్ బాలయేసు, ఫాదర్ గాబ్రియేల్, ఫాదర్ జాన్ పీటర్, మాచవరం సీఐ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 5న ఫీజ్ పోరును జయప్రదం చేయండి



(మొదటిపేజీ తరువాయి)

పేద విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. రాక్షసత్వంతో ఫీజ్ రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా పెద్ద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. విద్యార్థులు ఫీజ్ లు కట్టలేని పరిస్థితులలో కాలేజ్ యాజమాన్యాలు పిల్లలను వెళ్లగొడుతుంటే తల్లి దండ్రులు దిక్కుతోచలేని స్థితిలో నిలబడుతున్నారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఫీజ్ రీయంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెడితే చంద్రబాబు ఫీజ్ రీయంబర్స్మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసారని గుర్తుచేశారు. 2014 - 2019 మధ్యలోనే చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా అటు యాజమాన్యాల ఇటు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారన్నారు. తన తండ్రి బాటలో వైయస్ జగన్ మరో రెండు అడుగులు ముందుకు వేసి 93 శాతం మంది పిల్లలకు మేలు చేశారన్నారు. మన పిల్లల తలరాతలు మార్చాలంటే చదువుతోనే సాధ్యమని నమ్మిన జగన్ ప్రభుత్వం విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, అమ్మఒడి, గోరు ముద్ద వంటి పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేసారన్నారు. గత విద్య సంవత్సరంలో డిసెంబర్ త్రైమాసికం వరకు జగనన్న ప్రభుత్వంలో విద్యా దీవెనకే 12 వేల 6 వందల 9 కోట్లు ఖర్చు చేసారన్నారు. పేద విద్యార్థుల పట్ల వైయస్ జగన్ కి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అమ్మఒడి ఇంగ్లిష్ మీడియం మూడో తరగతి నుంచి టోఫెల్ మూడో తరగతి నుంచి సైబ్జెక్టు టీచర్ ను కూడా రద్దు చేశారన్నారు. 8 తరగతి పిల్లలకు టాబ్ లు, బైజూస్ కంటెంట్ లు కూడా లేవన్నారు. నాడు నేడు పనులను అటకెక్కించి స్కూల్ ల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం అడ్డుకుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారు 2 వేల 8 వందల కోట్లకు పైగా ఫీజ్ రీయంబర్స్మెంట్ పెండింగ్ లో ఉందని మరో 11 వందల కోట్లు వసతి దీవెన బకాయిలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. గతంలో చంద్రబాబు 2019 లో దిగిపోతూ 2 వేల 8 వందల కోట్లు ఫీజ్ రియంబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్ లో పెట్టారన్నారు. మధ్యాహ్న భోజన బకాయిలు 148 కోట్లు పెడితే జగనన్న ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు ప్రభుత్వం పై నిందలు వేయకుండా ఆ బకాయిలను తీరుస్తూ వచ్చారని గుర్తు చేసారు. రానున్న రోజులో పెండింగ్ లో ఉన్న ఫీజ్ రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించని యెడల లోకేష్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు బారి మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, షేక్ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, యలకల చలపతిరావు, నాయకులు డివి రెడ్డి, పెద్ది సాయి, సరగడ శంకర్ రెడ్డి, కూరాకుల నాగ, పిళ్ల సూరిబాబు (జగ్గు), గౌడిపేరు సుధీర్, తుపాకుల గురుమూర్తి రెడ్డి, గురుమహంతు మహేష్ తదితరులు పాల్గొన్నారు

# నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈ నెల ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు అభ్యర్థులు నామినేషన్లు వేయొచ్చన్నారు. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, ఫిబ్రవరి 13 నామినేషన్ల ఉపసంహారణకు చివరి తేదీ అని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు.

అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందని, ఈ నియమావళిని రాజకీయ పార్టీలు తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ భారత ఎన్నికల సంఘం - ఎంసీసీ నియమ నిబంధనలను క్షుణ్ణంగా చదివి వివరించారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 35,343 మంది పురుషులు, 27,796 మంది మహిళలు, 4గురు టీజీ ఓటర్లు కలిపి మొత్తం 63,143 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఆన్‌లైన్లో వచ్చే ఫారం-18లను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ముసాయిదా జాబితా ప్రకారం 76 పోలింగ్ స్టేషన్లు కలిగి ఉండగా, వాటిలో గుడివాడ రెవిన్యూ డివిజన్ పరిధిలో 23 పోలింగ్ కేంద్రాలు, మచిలీపట్నం డివిజన్ పరిధిలో 28, ఉయ్యూరు డివిజన్ పరిధిలో 25 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటికి అదనంగా సహాయ పోలింగ్ కేంద్రం కోసం ఒకటి ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. ఉన్న పోలింగ్ కేంద్రాలపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా కలెక్టర్ కు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, గుడివాడ, మచిలీపట్నం రెవిన్యూ డివిజన్ల అధికారులు జి బాలసుబ్రమణ్యం, కే స్వాతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బీజేపీ నాయకులు పీవీ గజేంద్రరావు, వైఎస్ఆర్సీపీ షేక్ సిలార్ దాదా, సిపిఎం కొడాలి శర్మ, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మతీన్, బీఎస్పీ ఎస్. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి





### ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ. తప్పక పాటించాలి

### జిల్లా పరిధిలో 20 ఎంసీసీ బృందాల ఏర్పాటు

### ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమావేశం

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. ఎమ్మెల్సీ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈ నెల 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు అభ్యర్థులు నామినేషన్లు వేయొచ్చన్నారు. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, ఫిబ్రవరి 13 నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అని తెలిపారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు.

అప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉంటుందని, ఈ నియమావళిని రాజకీయ పార్టీలు తు.చ. తప్ప కుండా పాటించాలన్నారు. ఈసీఐ- ఎంసీసీ నియమ నిబంధనలను క్షుణ్ణంగా చదివి వివరించారు. ప్రత్యేకంగా 20 ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన జరుగుతోందని, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరక్కుండా పటిష్ట పర్యవేక్షణ ఉంటుందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎన్‌టీఆర్ జిల్లాలో 45,540 మంది పురుషులు, 32,685 మంది మహిళలు, 13 మంది టీజీ ఓటర్లు మొత్తం 78,238 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఆన్‌లైన్లో వచ్చే ఫారం-18లను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 101 పోలింగ్ స్టేషన్లకు ఆమోదం లభించిందని, అదేవిధంగా ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలో వెయ్యి ఓట్లు కంటే ఎక్కువగా ఉన్న సందర్భంలో 11 ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లకు ప్రతిపాదనలు రూపొందించినట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

**కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూం:**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే క్రమంలో కలెక్టరేట్‌లో 0866 - 2575822 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూం పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, నోడల్ అధికారి కె.శ్రీనివాసరావు, బి.అనిల్ (టీడీపీ), బి.కిరణ్ (ఐఎన్‌సీ), పి.ఏసుదాస్ (ఐఎన్‌సీ), వై.ఆంజనేయరెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), ఎం.వినోద్ కుమార్ (బీఎస్పీ), ఇ.సురేష్ కుమార్ (సీపీఎం), బి.శంకర్ (సీపీఐ), బి.రాజా (సీపీఐ), కె.పరమేశ్వరరావు (ఆప్)లతో పాటు కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రమౌళి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన




**నందివాడ,మేజర్ న్యూస్:** ఎస్పీ ఆర్. గంగాధర రావు ఆదేశాల మేరకు శక్తి టీమ్ తో శనివారం నందివాడ మండలం రుద్రపాక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తమ చిట్టి చేతులను పట్టి నలుపుతుంటే ఎందుకో తెలియక బిత్తర చూపులు చూస్తారే తప్ప ఆ చేతులను విడిపించుకోని పారిపోవాలన్న తెలివి వారికి లేదు. చెంపలను తడుముతుంటే... ముద్దు చేస్తున్నారనుకుంటారు కానీ, ఎదుటి వారి మనసులోని రాక్షస కోరికను అర్థం చేసుకోలేరు. అందుకే తల్లిదండ్రులు మేల్కోవాలి. పిల్లలకు'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' ఏదో పిల్లలకు తెలియజేయాలి. విద్యార్థులకు శారీరక భద్రత, స్వీయ రక్షణ, దినచర్యల్లో ఎదురయ్యే సవాళ్లపై సరళమైన, స్పష్టమైన సమాచారాన్ని అందించారు. గుడ్ టచ్ అంటే అనుబంధాన్ని వ్యక్తపరచే, ప్రేమను చూపే, నిబద్ధతతో కూడిన స్పర్శలు కాగా, బ్యాడ్ టచ్ అనేది అసౌకర్యం కలిగించే, అనుమానాస్పద లేదా బాధనిచ్చే స్పర్శలని వివరించారు. విద్యార్థులు తమ శరీర భద్రత గురించి పూర్తిగా చైతన్యవంతంగా ఉండాలనే విషయాన్ని ఎస్ఐ కె.శ్రీనివాస్ వివరించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు వెంటనే సమాచారాన్ని విద్యార్థులు తెలియజేయాలని పోక్సో చట్టాలు, ట్రాఫిక్ రూల్స్ పై గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి టీం లేదా పోలీసులు అందుబాటులో ఉంటారని, 100 లేదా 112 వంటి నెంబర్లను ఉపయోగించి సహాయం పొందవచ్చని ఆయన తెలియజేశారు. విద్యార్థులకు గంజాయి, ఇతరేతర మత్తు పదార్థాలకు దూరంగ ఉండాలని తమ సమస్యలను తెలియజేయడంలో సిగ్గు, భయాన్ని విడిచి, ధైర్యంగా వ్యవహరించేలా ఉండాలనీ సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్.ఐ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**పామర్రు మేజర్ న్యూస్:** పమిడిముక్కల మండలం గోపువానిపాలెం అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం ముందు వెళ్తున్న కారు సడెన్‌గా ఆగడంతో కారును వెనుక వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. మచిలీపట్నం కు చెందిన నడకుదుటి ఆంజనేయులు(30)గా గుర్తించారు. సమాచారం మేరకు పమిడిముక్కల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**గన్నవరం, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్, గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో 11కె.వి రాయ్ నగర్ ఫీడర్ ఈ రోజు ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు హరిజనవాడ, ఉపాధ్యాయ నగర్, చర్చ్ రోడ్డు, రీచ్ రోడ్డు, రాయ్ నగర్, రామ్ నగర్, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, ఎమ్మార్వో ఆఫీస్ ఏరియా, గాంధీ బొమ్మ సెంటర్, బుద్ధవరంరోడ్డు, గౌడ్ పేట, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, వీనస్ బజార్, చెంచుల కాలనీ, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యాపార వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## కేంద్ర బడ్జెట్ పెద్ద ఉపశమనం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పార్లమెంట్లో శనివారం ప్రవేశపెట్టిన 2025 -26 కేంద్ర బడ్జెట్ పేద మధ్య తరగతి కుటుంబాలకు ఉపశమనమని, గత బడ్జెట్లో కంటే ఈ బడ్జెట్ ఎంత ప్రయోజనారిగా ఉందని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 75 వేల ఎంబిబిఎస్ సీట్లు కేటాయించడం స్వాగతం జరిగిన విషయమని అన్నారు మధ్యతరగతి పౌరుడు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా ఇన్కమ్ టాక్స్ పరిధిని 4 లక్షల నుండి 12 లక్షల పెంచడం దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రామీణ అభివృద్ధి కోసం 2,66,817 కోట్లు కేటాయించటం ద్వారా దేశవ్యాప్తంగా గ్రామపంచాయతీలు అభివృద్ధికి దోహదం పడుతుందని బాలాజీ అన్నారు వ్యవసాయం అనుబంధ రంగాలకు 171437 కోట్లు, విద్యకు 1,28,650కోట్లు కేటాయించడం విద్యకు వైద్యకు వైద్యానికి వ్యవసాయానికి అగ్ర పీఠం వేసినట్లేనని బాలాజీ అన్నారు. న్యాయశాఖకు అదనపు నిధులు కేటాయించినట్లయితే న్యాయస్థానాలను నిర్మించి నూతన న్యాయమూర్తులను నియమించుకొని కేసులు పరిష్కారానికి మరింత దోహద ఉండేదని బాలాజీ అన్నారు.

## ప్రవీణ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కైలే



**పామర్రు ఫిబ్రవరి 1 మేజర్ న్యూస్ :** పామర్రు మండలంలోని రాపర్ల గ్రామంలో పామర్రు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో- కన్వీనర్ కాకి ప్రవీణ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులు కాగా మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



### నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**పామర్రు ఫిబ్రవరి 1 మేజర్ న్యూస్ :** పామర్రు టౌన్ లోని పాలశీతలీకరణ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన గుంటిరెడ్డి నవీన్ వివాహ రిసెప్షన్ వేడుకలలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు జనసేనపార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నర్సాపురం సర్వీసును పునరుద్ధరించండి

- వైసీపీ అభిమాని గౌతం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఏపీఎస్ ఆర్ టి సి అవనిగడ్డ డిపో నుండి నాగాయలంక – నరసాపురం బస్సు సర్వీస్ ను పునరుద్దరించాలని వైసీపీ అభిమాని బడే గౌతం శనివారం డిపో మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ గతంలో అవనిగడ్డ డిపో నుండి నడిపిన నాగాయలంక – నరసాపురం బస్సు సర్వీసు నాగాయలంక, అవనిగడ్డ, మచిలీపట్నం ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, ఈ ప్రాంతాల నుండి భీమవరం, నరసాపురం వెళ్లే మత్స్యకారులతో పాటు విద్యార్థులు ఉద్యోగస్తులకు ఎంతో సౌకర్యంగా ఉండేదని, ఈ సర్వీసును నిలిపివేయడం వలన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరమైన నాగాయలంక నుండి నరసాపురం డైరెక్ట్ సర్వీసును తిరిగి ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

### సర్పంచిని పరామర్శించిన గౌతమ్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దక్షిణ చిరువోల్లంక గ్రామ సర్పంచ్ సనకా సుబ్రమణ్యంను వైసీపీ అభిమాని, యువ నాయకుడు గౌతమ్ పరామర్శించారు. గత కొంతకాలంగా సర్పంచ్ సుబ్రమణ్యం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బడే గౌతమ్ శనివారం వారి ఇంటి కి వెళ్ళి పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త పున్నయ్య (చౌదరి)తండ్రి అంకినీడును మాచవరం గ్రామంలోని ఆయన ఇంటి వద్ద వెళ్లి పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ తో పాటు ఆయన మిత్రబృందం స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### స్వచ్ఛ చల్లపల్లికి రూ.75వేలు విరాళం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకం అని ఎన్ఆర్ఐ డాక్టర్ దోనేపూడి శరత్ అన్నారు. శనివారం చల్లపల్లిలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం కోసం ఆయన రూ.75 వేలు విరాళాన్ని మన కోసం మనం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాదుకు అందచేశారు. గ్రామ పరిశుభ్రత, సుందరీకరణ కోసం పదేళ్లగా శ్రమిస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్ కే ప్రసాద్ - డాక్టర్ టీ పద్మావతి దంపతులు, కార్యకర్తలు ఆదర్శనీయులు అన్నారు.

ప్రతీకార రాజకీయాల కోసం కాదు..

# గన్నవరం అభివృద్ధి కోసం రాజకీయంలోకి వచ్చా...

**ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్**



**గన్నవరం, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** గన్నవరం క్యాంప్ కార్యాలయంలో గన్నవరం టౌన్ పార్టీ ఆధ్వర్యంలో గన్నవరం ఎస్సీ కాలనీకి చెందిన 110 మంది వైసీపీ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తీర్థం పుచ్చుకున్నారు. గత వారం వైసీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన రంగారావు రాజీనామ చేసి శనివారం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సమక్షంలో టీడీపీ పార్టీ లో చేరారు. వారికి యార్లగడ్డ వెంకట్రావు తెలుగు దేశం పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. గన్నవరం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ ప్రతీకార రాజకీయాల కోసం తాను రాజకీయాలకు రాలేదని, గన్నవరం అభివృద్దే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నానని వెల్లడించారు. 84 పంచాయితీలు వున్నా ఈ నియోజకవర్గంలో ఎస్సి కాలనిలో తనకే ఎక్కువ మెజార్టీ వచ్చిందన్నారు. రంగారావు రాకతో గన్నవరం టౌన్‌లోని ఎస్సి కాలనిలో మెజారిటీ మరింత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. మీ బిడ్డలా భవిష్యత్ కోసం తాను పనిచేస్తున్నానని ఇందులో భాగంగా ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మల్లవల్లి పారిశ్రామికవాడతో యువతకు ఉద్యోగాలు రావడం ఖాయమని స్పష్టం చేశారు. జాబ్ మేళాల ద్వారా అనేక మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని గుర్తు చేశారు. మంచి చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, తనకు అందరి సహకారం కావాలని కోరారు. సమిష్టి గా పనిచేయడం ద్వారా గన్నవరం నియోజకవర్గం మోడల్ నియోజకవర్గం గా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి సూపర్ సిక్స్ ప్రకటిస్తే తాను గన్నవరం నియోజకవర్గానికి సూపర్ సిక్స్ ప్రకటించానని గుర్తు చేశారు. అశోక్ లేలాండ్ సంస్థను మల్లవల్లికి తీసుకువస్తానని చెప్పానని, చెప్పినట్లుగానే వెనక్కి తీసుకువచ్చి మన నియోజకవర్గ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెల్లడించారు.

### త్వరలో నియోజకవర్గంలో కమిటీలు

**బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు**



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కొడాలిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ప్రజల పెనం మీద నుండి పొయ్యిలో పడినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, రైతు బరోసా, ఆటో కార్మికులకు, వివిద వృత్తులవారికి తగిన పెన్షన్లు ఇస్తూ ఉంటే అంతకన్నా మిన్నగా ఆకాశమే హద్దుగా ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వాగ్దానాన్ని నమ్మి మోసపోయారని ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీలు వేటికి కూడా బాహుజనుల సాధక బాధలు తెలియదని రేవు దాటేదాకా ఏరు మల్లన్న రేవు దాటిన తరువాత బోడిమల్లన్న చందాన వాగ్దానాలున్నాయన్నారు. బిసి, ఎస్.సి, మైనారిటీ అగ్రవర్ణ పేదలకు సహితం బహుజన సమాజ్ పార్టీ న్యాయం చేయగలదన్నారు. త్వరలో నియోజక వర్గ స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయటం జరగుతుందని ఇప్పటికే మండల స్థాయి కమీటీల నిర్మాణం పూర్తి చేశామని, నియోజకవర్గ కమిటీ ఏర్పాటులో సలహాలు సూచనలు, అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. ఘంటశాల మండలాధ్యక్షులు గరికముక్కు నాగేశ్వరరావు, చల్లపల్లి మండలాధ్యక్షులు కొడాలి దేవా, తదితరులు పాల్గొన్నారు.

### వరసిద్ది వినాయక స్వామి ప్రతిష్ఠామహోత్సవాలు ప్రారంభం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** స్థానిక నారాయణరావు నగర్ లో ఆరవ నెంబరు కాలువ పక్కనే నూతనంగా నిర్మించిన శ్రీవం సిద్ధి వినాయక స్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానములు, శ్రీవాణి ట్రస్ట్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠా మహోత్సవాలు వాస్తు జ్యోతిష ఆగమ ప్రవర నల్లూరు దాశరథి శ్రీనివాస దీక్షితుల బ్రహ్మత్వంలో జరుగుతున్నాయి. శనివారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, వాస్తు ఆలయ, యాగశాల వాస్తు శుద్ధి, సాయంత్రం విశ్వక్సేన పూజ, అంకురారోపణ, నిత్యహోమము కార్యక్రమాలు జరిగాయి. ప్రతిష్ఠామహోత్సవం కోసం యాగశాల నిర్మించి ఆలయాన్ని ముస్తాబుచేశారు. దేవాలయ ప్రాంగణం, కాలనీలో రహదారుల వెంబడి విద్యుద్దీపాలతో అలంకరణ చేపట్టారు.

### బీహార్‌ని పోలిస్తే ఏపీకు నిరాశే.. : సద్రుద్దీన్ ఖురేషి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కేంద్ర బడ్జెట్ లో ఏపీకు తీవ్ర నష్టం. కేంద్ర రాష్ట్ర నెల సరి ఉద్యోగులకు పన్ను మినహాయింపు పట్ల హర్షం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కారణపై స్పష్టత లేదు. పోలవరం ప్రాజెక్టు విషయంలో క్లారిటీ ఇవ్వకపోవటం శోచనీయం. ఇక పోతే కిసాన్ క్రెడిట్ కార్డు మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు రుణాలు గొప్ప విషయం, ఇది రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది అని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ సదర్ ఉద్దీన్ ఖురేషి తెలిపారు.

### కందిమళ్ళని శాలువాతో సత్కరించిన గోపు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** కానూరు మం దల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ శనివారం పదవి విరమణ చేసిన కందిమళ్ళ రాంబాబుని కృష్ణా జిల్లా తెలుగురైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలు విద్యార్థులకు విద్య బుద్దులు నేర్పి కొన్ని వందల విద్యార్థుల జీవితాలను సన్మార్గంలో నడిపించిన రాంబాబు శేష జీవి తం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీత రాము, బొమ్మిడి ఏడుకొండలు, మోపిదేవి కృష్ణా,పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బడ్జెట్ పేద మధ్యతరగతి కుటుంబాలకు పెద్దపీట



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పార్లమెంట్లో శనివారం ప్రవేశపెట్టిన 2025 -26 కేంద్ర బడ్జెట్ పేద మధ్య తరగతి కుటుంబాలకు ఉపశమనమని, గత బడ్జెట్లో కంటే ఈ బడ్జెట్ ఎంత ప్రయోజనారిగా ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్ర రావు అన్నారు. వారు మాట్లాడుతూ వచ్చే ఐదు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 75 వేల ఎంబిబిఎస్ సీట్లు కేటాయించడం స్వాగతం జరిగిన విషయమని అన్నారు మధ్యతరగతి పౌరుడు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా ఇన్కమ్ టాక్స్ పరిధిని 4 లక్షల నుండి 12 లక్షల పెంచడం దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రామీణ అభివృద్ధి కోసం 2,66,817 కోట్లు కేటాయించటం ద్వారా దేశవ్యాప్తంగా గ్రామపంచాయతీలు అభివృద్ధికి దోహదం పడుతుందని గజేంద్ర అన్నారు వ్యవసాయం అనుబంధ రంగాలకు 171437 కోట్లు, విద్యకు 1,28,650కోట్లు కేటాయించడం విద్యకు వైద్యకు వైద్యానికి వ్యవసాయానికి అగ్ర పీఠం ఈ బడ్జెట్ దేశ ప్రజలకు ఎంతో ఆనందదాయకవని గజేంద్ర అన్నారు.

# ఆంధ్ర ప్రాంతానికి సాగు నీటిని విడుదల చేయాలి

### ప్రాజెక్ట్ కమీటి చైర్మన్ కోట వీరబాబు





**నందిగామ, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాదారం వద్ద నాగార్జున సాగర్ ఎడమ కాలువ జోన్ 2 పరిధిలోని 16, 17 డివిఆర్ బ్రాంచ్ కెనాల్ కు శనివారం నాడు నీటి విడుదలను పరిశీలించిన నాగార్జునసాగర్ లాల్ బహుదూర్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖరరావు జగ్గయ్యపేట డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఏలూరి గోపాలరావు, వైస్ చైర్మన్ మన్నే నారాయణరావు నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరరావు జగ్గయ్యపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ రాథోడ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాల్ నాయక్, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కమీటి చైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ ఆంధ్ర ప్రాంతానికి రావలసిన సాగర్ జలాలను సకాలంలో విడుదల చేసి రైతులను అనుకోవాలధి తెలంగాణ ప్రాంత ఎన్ఎస్పీ అధికారులను కోరడం జరిగింది. దీనిపై తెలంగాణా ప్రాంతానికి చెందిన చెర్వుమాధారం ట్యాంక్ పర్యవేక్షణ అధికారి నరేష్ సానుకూలంగా స్పందించారు. రాబోయే వారం రోజులు పాటు నిరంతరాయంగా సీఎం ట్యాంక్ నుండి నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్ర ప్రాంతంలోని రైతులు కూడా వారబంధి పద్ధతిలో దిగవ రైతులకు సాగు నీరందించడానికి సహకరించాలని వారు కోరారు వారబంది పద్ధతిని సక్రమంగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను వీరబాబు ఆదేశించారు.అనంతరం నీటి సంఘాల ప్రతినిధులతో కలిసి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)ని కలిసి నీటి విడుదలపై సమగ్ర సమాచారాన్ని అందించారు. అదేవిధంగా చెరువు మాదారం చెరువు నుండి తెలంగాణ ప్రాంతంలో జీరో నుండి ఒకటిన్నర కిలోమీటర్ వరకు కాలువకు లైనింగ్ దెబ్బతినడం జరిగిందని తక్షణమే తెలంగాణ అధికారులతో చర్చించి మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తాతయ్యకి విజ్ఞప్తి చేశారు.

# శ్రీ కోదండ రామాలయంలో 4 నుంచి ప్రత్యేక పూజలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4,5,6,7 తేదీలలో నిర్వహిస్తున్నట్లు మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మూడవ వార్డులోని శ్రీ కోదండ రామాలయంలో తిరుపతి తిరుమల దేవస్థానం ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలులో భాగంగా 4వ తేదీ మంగళవారం సాయంత్రం మహాభారత ఉపన్యాసం సింహాద్రి పద్మ చెబుతారు అని అనంతరము హనుమాన్ భక్త బృందంచే భజన కార్యక్రమం జరుగుతుంది అన్నారు. 5వ తేదీ బుధవారంసాయంత్రం మహాభారత ఉపన్యాసం, భజన కార్యక్రమం. 6వ తేదీ గురువారం సాయంత్రం భగవద్గీత ఉపన్యాసం, భజన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 7 తేదీ శుక్రవారం ఉదయం 9గం సుహాసినిలచే సామూహిక కుమార్చన కార్యక్రమాలు జరుగుతాయని ఈ కార్యక్రమానికి కావలసిన పూజా సామాగ్రి, లక్ష్మీ దేవి రూపు, కంకణం, పసుపు కుంకుమ తిరుమల తిరుపతి దేవస్థానం వారే అందజేస్తారని ధర్మాచార్యులు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ధార్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కృష్ణ కోరారు. ఈ



సందర్భంగా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను టీటీడీ జిల్లా కోఆర్డినేటర్ సి వి కె ప్రసాద్ మోపిదేవి మండల ధర్మాచార్యులు గరికిపాటి వీరాంజనేయులు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి బసవ శంకర్రావులు భక్తులకు పంపిణీ చేశారు.

## కేంద్ర బడ్జెట్ లో అని వర్గాల ప్రజలకు ప్రాధాన్యత

### బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ శర్మ



**నందిగామ, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్:** భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి మధ్యతరగతి పేద ప్రజల లక్ష్యంగా సేవలు అందిస్తుంటే తట్టుకోలేని కాంగ్రెస్ కమ్యూనిస్టు నాయకులు ఆదాని అంబానీ అంటూ పెట్టుబడిదారులకు మద్దతు ఇస్తున్నారు అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం ఎంతవరకు సమంజసం అని బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కేదార్నాథ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత 15 సంవత్సరాలుగా మధ్యతరగతి ప్రజలు పేద ప్రజలు ఉండటానికి ఇల్లు తినటానికి తిండి అనే రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ప్రాధాన్యతిస్తూ ఇన్కమ్ టాక్స్ లో కానివ్వండి ఇండస్ట్రియలైజేషన్ పాలసీలో కానివ్వండి విద్యార్థులకు చేయూతనివ్వడంలో కానివ్వండి అంగన్వాడీ కేంద్రాల వారి కానివ్వండి రకరకాల రూపాల్లో ఆదుకుంటుంటే రైతులకు అన్యాయం చేస్తున్నారు. కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తప్పు దోవ పట్టిస్తున్నటువంటి కమ్యూనిస్టులకు కాంగ్రెస్ వారికి కనువిప్పు కలిగించేదే అన్నారు. ఈ బడ్జెట్ అని ఆయన తెలిపారు. ఎమ్మెస్ ఎంఇలకు ప్రాధాన్యతిస్తూ మధ్యతరగతి యువతకు స్టార్టప్ రంగంలో చేయూతలిగాలని లక్ష్యంతో లక్షల కోట్ల రూపాయల రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నటువంటి మోడీ ప్రభుత్వానికి యువత రుణపడి ఉందని ఆయన తెలిపారు పేద ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్య ఇస్తూ ఎయిమ్స్ల నిర్మాణం మధ్యతరగతి పేద ప్రజల కు ఆర్థికంగా ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మోడీ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్కి ధన్యవాదాలు తెలిపారు.




## నాటు కోడిగుడ్లలో ఎన్నో పోషక విలువలు

### సమన్వయకర్త డా. సుధారాణి

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాలలో పెరటి కోళ్ల పెంపకం పై 6 రోజుల నైపుణ్యత శిక్షణా ముగిసినది. మన గ్రామీణ భారత దేశంలో నేటికీ 65% పైగా జనాభా వ్యవసాయ, అనుభంద రంగాలపై ఆధారపడి జీవిస్తుంది. అనుబంధ రంగాలలో తక్కువ శ్రమ తక్కువ పెట్టుబడితో పోషకాహారాన్ని అధించే రంగం పెరటి కోళ్ల పెంపకం అని కె.వి.కె సమన్వయ కర్త డా. సుధారాణి తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. ఎస్.వి.ఎస్ గోపాలస్వామి మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం వలన ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. పశు వైద్యాధికారి డా. మనోజ్ కుమార్ మాట్లాడుతూ నాటు కోడి గుడ్లలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, ప్రతి కుటుంబం పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలని కోరారు. మత్స్య శాస్త్రవేత్త జె. యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ పెరటిలో పెంచుకోవడానికి అనువైన, పెరటి కోళ్ల కంటే అధిక ఉత్పాదకత శక్తి గల కోళ్ళ రకాలను వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజలకు చేరువ చేయడానికి కె.వి.కె కృషి చేస్తుంది అని తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమం తమకు ఎంతగానో ఉపయోగపడింది అని శిక్షణా అభ్యర్థులు హర్షం వ్యక్తపరిచారు. కేవికే శాస్త్రవేత్తలు, డా. నవీన్, డా. కృష్ణవేణి, డా. రేవతి డా. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## మూడు గంటల వ్యవధిలో 100% పెన్షన్ల పంపిణీ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 6 (డిజిటల్ అసిస్టెంట్) టి పద్మావతి మూడు గంటల వ్యవధిలో 91 పెన్షన్లు గాను 91 పంపిణీ చేసి 100% పూర్తి చేయుటలో మొదటి వరుసలో నిలిచింది. శనివారం వేకనూరు గ్రామంలో 91 పెన్షన్ గాను 91 శనివారం పెన్షన్లు పంపిణీ చేసి మొదటి స్థానంలో నిలిచింది. గతంలో కూడా ఫంక్షన్ పూర్తి చేసి మన్ననలు పొందారు. ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు పెన్షన్లు పంపిణీ ప్రారంభించి 9 గంటల సమయం అయ్యేసరికి 100% పెన్షన్లు పంపిణీ చేసిన పద్మావతి ని గ్రామస్తులు అభినందించారు.

## పెన్షన్ పంపిణీలో ప్రత్యేక అధికారిని లక్ష్మి



**నందిగామ ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్:** మండలంలోని అంబర్పేట గ్రామంలో శనివారం ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిని డి శ్రీ లక్ష్మీ వృద్ధులకు దివ్యాంగులకు ప్రభుత్వం పెన్షన్ నగదును అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ సొమ్ముపెన్షన్ దారులకు సకాలంలో అందేలా సచివాలయం సిబ్బంది దృష్టి సారించాలని ఆమె తెలిపారు. అనంతరం అంబర్పేట గ్రామంలోని పలు అంగనవాడి కేంద్రాలను జిల్లా ప్రత్యేక అధికారిని శ్రీలక్ష్మి విద్యార్థుల హాజరు శాతం,బోధన, విద్యార్థులకు పోషణ ఆహార పట్టికను పరిశీలించారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ భాగ్య రేణుక సూపర్వైజర్ వెంకట్రావ మ్మ, అంగనవాడి టీచర్లు బేబీ రాణి పార్వతి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించిన జడ్పీటీసీ సభ్యురాలు



**పామర్రు ఫిబ్రవరి 1 మేజర్ న్యూస్:** పమిడి ముక్కల మండలం హనుమంతపురం, అగినపర్రులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం జడ్పిటిసి సభ్యురాలు ఏనుగ వెంకట రమణ కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ సక్రమంగా అందించాలని, సమయానికి పిల్లలకు భోజనం పెట్టాలని సూచించారు. అలాగే విద్యా విధానంపై విద్యార్థులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు తో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొడమంచిలి మహేష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో అమలవుతున్న పథకాలను గూర్చి వారికి వివరించారు.

## 19వ వార్డు కౌన్సిలర్ వైసీపీ పార్టీకి రాజీనామా



**నందిగామ, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేల నందిగామ వైసీపీకి మరో కౌన్సిలర్ శనివారం రాజీనామా చేయటం జరిగింది 19వ వార్డులో నివాసం ఉంటున్న మంద మరియమ్మ వైసీపీ వార్డు కౌన్సిలర్గా గెలుపొందారు ఈనెల మూడో తేదీన నందిగామ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ఆమె రాజీనామా చేయటం ఆ పార్టీకి షాక్ తగిలినట్లుగానే భావించవలసి ఉంది ఇప్పటికే వైసీపీ పార్టీ నుండి అధికార కూటమి లోకి ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు జాయిన్ అయినా నేపథ్యంలో 19వ వార్డు కౌన్సిలర్ గా ఉన్న మంద మరియమ్మ శనివారం రాజీనామా చేయటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది తను ఏ పార్టీలో చేరడం లేదని వైసీపీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు దీనికి గల కారణాలు తన వ్యక్తిగత కారణాలుగా భావించాలని తెలియజేశారు కాగా సోమవారం చైర్మన్ ఎన్నిక కు ఆమె ఎవరికి మద్దతు ఇస్తారు అనేదానిపై వేచి చూడవలసి ఉంది.



## అబాకస్ బ్రెయిన్‌బాటిల్ పోటీల్లో విజేతలుగా నారాయణ విద్యార్థులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** అబాకస్ బ్రెయిన్‌బాటిల్ పరీక్ష పోటీల్లో 3 రౌండ్ లలో పూర్తి చేసి ఫోర్త్ రౌండ్‌లో విజేతలుగా పటమట నారాయణ ఈ.ఎం. స్కూల్ విద్యార్థులు బహుమతులు గెలుచుకోవడం ఆనందంగా ఉందని ఏజీఎం మురళీ కిషోర్ అన్నారు. శనివారం పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు స్కూల్ యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా స్కూల్ ఏజీఎం మురళీ కిషోర్ మాట్లాడుతూ నసిక గణితాన్ని నేర్చుకోవడంలో ఆసక్తి ఉన్న, సంఖ్యలపై నైపుణ్యం ఉన్న ఏ విద్యార్థి అయినా వారి కూడిక, తీసివేత, గుణకారం, భాగహార నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. గణిత గణనలను లెక్కించడానికి, నిర్వహించడానికి ఉపయోగించే పురాతన సాధనం అబాకస్ అని ఆయన తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అబాకస్ ను నేర్చుకోవడమే కాకుండా పోటీల్లో పాల్గొని పటమట నారాయణ ఈ.ఎం. స్కూల్ విద్యార్థులు అందరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ సమావేశంలో కో–ఆర్డినేటర్ జహూర్ ఫాతిమా ఖాన్, క్లస్టర్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజు పాల్గొన్నారు.

## 5న వైఎస్సార్‌సీపీ "ఫీజు పోరు"..

### పామర్రులో పోస్టర్ ను ఆవిష్కరించిన పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



**పామర్రు ఫిబ్రవరి 1 మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఫిబ్రవరి 5న తలపెట్టిన 'ఫీజు పోరు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పామర్రు మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆవిష్కరించారు. వైయస్ఆర్ సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఫీజుపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి వారి భవిష్యత్తుని అంధకారమయం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఫిబ్రవరి 5న ఫీజు పోరు కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఈ నిరసన పోరును నిర్వహించబోతున్నామన్నారు. మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయానికి శాంతియుత ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించబోతున్నామని కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు.

## చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 మందికి వస్త్రాల పంపిణీ



**అమరావతి మేజర్ న్యూస్ :** పేదలకు కావలసిన అన్నదానం, వస్త్రదానం , వైద్య సహాయం అందించాలని లక్ష్యంతో చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాఘ బంధు కార్యక్రమం జరుగుతోందని నిజాంపేట్ సంస్థ కార్యదర్శి అప్పాజీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఉదయం 10.30గంటలకు బస్తీలోని అనాథలకు, దివ్యాంగులకు, వృద్ధులకు కావలసిన వస్త్రాలను దాదాపు 20 మందికి పంపిణీ చేశారు. మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో ఈ సంస్థ ఆధ్వర్యంలో 60 ప్రదేశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు అప్పాజీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

# బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం..



### బీసీ కార్పొరేషన్‌కు రూ.896.79కోట్ల కేటాయింపుపై టీడీపీ నేతల హర్షం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బీసీల అభివృద్ధి అభ్యున్నతి నారా చంద్రబాబు నాయుడుతో మాత్రమే సాధ్యమని మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ బీసీ నాయకులు పేర్కొన్నారు.బీసీ కార్పొరేషన్ కు రూ. 896.79 కోట్లు కేటాయింపును హర్షిస్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీసీ సెల్ నాయకులందరూ హాజరయ్యారు.ఈ సందర్భంగా బిసి నేతలు మాట్లాడుతూ బీసీలు సొంతంగా వ్యాపారాలు చేసుకుని తమకాళ్ల మీద వాళ్లు నిలబడేలా బీసీ కార్పొరేషన్ ద్వారా పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేసేందుకు నిధులివ్వడం సంతోషంగా ఉంది.గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఫలితంగా బీసీలు ఆర్థికంగా వెనుకబడ్డారన్నారు బీసీలకు చెందిన సుమారు రూ.75 వేల కోట్ల నిధుల్ని దారి మళ్లించారని మండిపడ్డారు.బీసీలకు స్థానిక సమస్యల ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్లు రద్దు చేశారు. వారికి ఉన్న హక్కుల్ని కాలరాశారని మండిపడ్డారు.కేవలం బీసీల అభ్యున్నతికే కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.జూన్,జులై మాసాల్లో 'తల్లికి వందనం' పేరుతో తమ పిల్లలను స్కూల్స్ కు పంపుతున్న ప్రతి తల్లి బ్యాంక్ ఎకౌంట్ లో రూ. 15వేలు జమ చేయనున్నట్టు తెలిపారు. ఆర్టీసీలో కొత్త బస్సుల కొనుగోలు చేసి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు,తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా నివారణకు ప్రతిష్ట చర్యలు



### జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వర్లు

**జగ్గయ్యపేట,ఫిబ్రవరి 1 మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా పై ఉక్కు పాదం మోపినట్లు జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా పై ఇప్పటికి 55 కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో 46 ట్రాక్టర్లు, 23 లారీలు, 2 జెసిబిలను సీజ్ చేసినట్ల తెలిపారు.

జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో 15 చెక్ పోస్ట్ ల ద్వారా ఇసుక అక్రమ రవాణా నివారించేందుకు ప్రతిష్ట చర్యలు మా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని 6 ఇసుక రిచ్ లు ఉన్నాయని, ఈ రిచ్‌లలో ప్రస్తుతం ఓపెన్ లో లేవన్నారు. ఆంధ్రాలో గల ఇసుకను తెలంగాణ వెళ్లకుండా ఉండేందుకు 15 చెక్ పోస్ట్ లలో భారీ భద్రత ఏర్పాటు చేయడంతో పాటు డోన్ సీసీ కెమెరాలతో గట్టిగా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లకల్లు, జగ్గయ్యపేట ఎస్సైలు టి సూర్య శ్రీనివాస్, జి రాజు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి రాజాని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం







### ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో టిడిపి - జనసేన - బిజెపి నేతల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడివాడ, మేజర్ న్యూస్:** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు గుడివాడ నుండి అత్యధిక మెజార్టీ తీసుకువచ్చే బాధ్యతను మనమందరం తీసుకుందామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో గుడివాడ టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో టిడిపి – జనసేన – బిజెపి శ్రేణులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు నేతృత్వంలో శనివారం ఉదయం కూటమి పార్టీ నాయకుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల శ్రేణులకు ఎమ్మెల్యే రాము, నాయకులు దిశా నిర్దేశం చేశారు. నేటి నుండి పోలింగ్ పూర్తి అయ్యేవరకు చెయ్యవలసిన పనులపై కూటమి నాయకులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు తమంతా ఏ విధంగా అయితే సమన్వయంతో పనిచేశామో అదేవిధంగానే ఇప్పుడూ పనిచేద్దామని ఎమ్మెల్యే రాము కోరారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగనున్న దృష్ట్యా, మనమందరం ఈలోగా ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును కలిసి.. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా భారీ మెజారిటీతో గెలిచేలా కృషి చేద్దామని ఎమ్మెల్యే రాము అన్నారు. చదువుకున్న వారంతా కూటమితోనే ఉన్నారంటూ ఎవరూ ఓవర్ కాన్ఫిడెన్స్‌లో ఉండొద్దన్నారు.ఏ ఎన్నికలు వచ్చినా మనం గెలిచినప్పుడే సుస్థిర పాలన సాధ్యమవుతుందన్నారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రాడ్యుయేట్లకు వివరించి, ప్రభుత్వం ఏర్పాటైన 7 నెలల్లోనే అన్ని ఇబ్బందులను అధిగమించి సుపరిపాలన వైపు అడుగులు వేస్తున్న విషయాన్ని తెలియజేయాలని కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే రాము సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్, రాజధాని అమరావతికి ఆర్థికసాయం, పోలవరానికి నిధులు, రైల్వే జోన్‌తో పాటు ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సుమారు రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 4 లక్షల మంది యువతకు ఉద్యోగాలు రానున్నాయని ఈ విషయాన్ని కూటమి శ్రేణులు ఓటర్లకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బురగడ్డ శ్రీకాంత్, బిజెపి మచిలీపట్నం పార్లమెంట్ కన్వీనర్ సురే లక్ష్మీనారాయణ గాంధీ, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, గుడివాడ బిజెపి ఇంచార్జ్ దావులూరి సురేంద్రబాబు, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండలం అధ్యక్షుడు వాసే మురళి, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సాయన పుష్పావతి, జనసేన పార్టీ నాయకులు సందు పవన్, గుడివాడ నియోజకవర్గ పరిధిలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ముఖ్య నాయకులు, మండల కమిటీల నాయకులు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

# పెన్షన్లు పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

**నిత్యం తాగునీటి పరీక్ష నిర్వహిస్తుండండి : విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు**







**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోగల పెన్షన్ల పంపిణీలను సత్వరమే పూర్తి చేయాలన్నారు కమిషనర్ ధ్యానచంద్ర. శనివారం ఉదయం 18వ డివిజన్ వాటర్ ట్యాంక్ రోడ్, రాణి గారి తోట ప్రాంతాల్లో పర్యటించి పెన్షన్ లబ్ధిదారులకు స్వయంగా తామే ఆధార్ కార్డు, రియల్ టైం బెనిఫిషరీ ఐడెంటిఫికేషన్ సిస్టం యాప్ లో పరిశీలించి పెన్షన్ నగదు అందజేశారు. వారితో మాట్లాడి ప్రతి నెల సరైన సమయానికి పెన్షన్ అందుతుందా లేదా, ఎంత పెన్షన్ అందుతుంది వంటి విషయాలపై అర తీశారు. తదుపరి ఇంజనీరింగ్ సిబ్బంది వారు చేస్తున్న తాగునీటి పరీక్షను పరిశీలించారు, అందులో ఉన్న క్లోరిన్ శాతంని పరిశీలించి, ప్రతిరోజు జరుగుతున్న తాగునీటి పరీక్షను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు నిత్యం పరిశుభ్రమైన తాగునీరుని అందజేసేలా చూసుకోవాలన్నారు. అధికారుల పర్యటనలో ఎప్పటికప్పుడు డ్రైన్ క్రాసింగ్ ని పరిశీలిస్తూ ఉండాలన్నారు.

తదుపరి రాణి గారి తోటలోని అన్న క్యాంటీన్ ను పరి శీలించి, కిచెన్ శుభ్రత ఆహార నాణ్యత మరుగుదొడ్ల నిర్వహణ ఎప్పటి కప్పుడు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, సూపరింటెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పటిష్ట పర్యవేక్షణతో సజావుగా పెన్షన్ల పంపిణీ








**కంచికచర్ల, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకొని పటిష్ట పర్యవేక్షణతో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను సజావుగా చేపట్టం జరిగిందని జిల్లా కలెక్టర్ డి. జి.లక్ష్మీశ అన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ.. కంచికచర్ల మండలంలోని పరిటాల, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో పర్యటించారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. శనివారం ఉదయం 6 గంటలకు పంపిణీని ప్రారంభించి, మొదటిరోజే జిల్లాలో 2,29,913 పెన్షన్లకు రూ. 98.20కోట్లు పంపిణీని పూర్తిచేసేందుకు కృషిచేయడం జరిగిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల పర్యవేక్షణతో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందించడం జరిగిందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పెన్షన్ల పంపిణీని పరిశీలించిన అనంతరం పరిటాలలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) కలెక్టర్ పరిశీలించారు. ఈ కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా, సామర్థ్యం మేరకు వర్మీ కంపోస్టును తయారు చేసేలా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును, డ్రెయిన్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయి పర్యటనలో కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# దేశ క్షేమం కోసం క్రైస్తవులు ప్రార్థించాలి

**సీజే ఏసి జిల్లా అధ్యక్షులు ఆర్ ఇర్మియ**




**కృత్తివెన్ను జనవరి 31 మేజర్ న్యూస్ :** క్రైస్తవులైన ప్రతి ఒక్కరూ దేశ రాష్ట్ర, గ్రామ క్షేమం కోసం ప్రార్థించాలని సిజేఏసీ జిల్లా అధ్యక్షులు రేవు ఇర్మియ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మాట్లం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీస్తును గూర్చిన సువార్త యాత్ర అనే కార్యక్రమాన్ని చేపట్టి మాట్లం గ్రామ పురవీధులలో సువార్తను చాటించారు. ఈ సందర్భంగా పలువురు దైవ సేవకులు మాట్లాడుతూ క్రైస్తవులమైన ప్రతి ఒక్కరు ఎదుటివారి క్షేమాన్ని కోరుకోవాలని అప్పుడే క్రైస్తవ్యానికి అర్థం ఉంటుందని తెలిపారు. మాట్లం గ్రామ అభివృద్ధి, సర్పంచ్, స్థానిక నాయకుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశంలో ఉన్న ప్రభుత్వం అలాగే రాష్ట్రంలో పరిపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని దేవుడు దీవించాలని ప్రజలందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు నాయకులు విశేషమైన కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ లోకంలో పెరిగిపోయిన పాప మాలిన్యం కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించి మూడో దినమున తిరిగి లేచిన మహనీయుడని కొనియాడారు. క్రైస్తవ్యం అనేది ఒక మార్గమని ఆ మార్గంలో పయనిస్తే పరలోకం చేరవచ్చు అన్నారు. చాలామంది క్రైస్తవ్యం అనేది మతం అని భావించి లేనిపోని అపార్థాలు సృష్టిస్తున్నారని క్రైస్తవం అనేది ఒక మార్గమని అది పరమునకు నడిపించేదని పేర్కొన్నారు. పురవీధులలో ప్రత్యేకమైన ప్రార్థనలు, గీతాలు ఆలపించి దైవ సందేశాన్ని అందించారు.

సిజేఏసి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్చ్ బిషప్ జాషువా డేనియల్ చెగోడి పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిజేఏసి సభ్యులు, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ ఆర్. ఐజక్, పెడన నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ సన్నీ జోసెఫ్, కృత్తివెన్ను మండల ప్రెసిడెంట్ బి. ఆనంద్, కలిదిండి మండల ప్రెసిడెంట్ బి. యేసురాజు, నర్సాపురం ప్రెసిడెంట్ నానాజీ, రాజేష్, కృత్తివెన్ను మండలంలో ఉన్న సేవకులు, మాట్లాం గ్రామానికి చెందిన దైవ సేవకులు, విశ్వాసులు, యూత్ వారు పాల్గొన్నారు.



## కృషి పట్టుదలతో చదివితే ఏదైనా సాధ్యమే... డీఎస్పీ విద్యా శ్రీ

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విద్యార్థులు కృషి పట్టుదలతో చదివితే దేన్నైనా సాధించవచ్చు డిఎస్పి విద్య శ్రీ అన్నారు. శనివారం ఎస్ వి ఎల్ క్రాంతి విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సంవత్సరం విద్యార్థులకు సెండ్ ఆఫ్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవనిగడ్డ డిఎస్పి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి కృషి పట్టుదలతో కష్టపడి చదివితే దేన్నైనా సాధించవచ్చని ఇంటర్మీడియట్‌లో 90 శాతం మార్పులు దాటిన విద్యార్థులు ఢిల్లీ యూనివర్సిటీలో మంచిగా చదువుకునే అవకాశాలు ఉంటాయి అన్నారు. భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆమె విద్యార్థులకు సూచించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలలో అందరూ బాగా రాసి మంచిర్యాంకులతో ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు, సొంత గ్రామాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి విద్యా శ్రీ ని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ ఎన్వి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కళాశాల సిబ్బంది విద్యార్థి విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## నాయకుల హడావుడి లేకుండా ప్రశాంతంగా పింఛన్ల పంపిణి



**పామర్రు ఫిబ్రవరి 1 మేజర్ న్యూస్ :** జిల్లాలో గ్రాడ్యుయేట్స్ పట్టభద్రుల శాస నమండలి ఎన్నికల నోటిఫికేషన్ రావడం తో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక నేతల హడావుడి కని పించలేదు. సచివాలయ ఉద్యోగులు ప్రశాంతంగా తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి తెల్లవారుజాము నుండి పింఛన్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉద్యోగులు తెల్లవారుజామునుండే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఉదయం 6 గంటల నుండి 9 గంటల మధ్య కొంతసేపు సర్వర్లు పనిచేయకపోవడంతో నిరాశ చెందారు. త్వరితగతిన నూరు శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉద్యోగులు తెల్లవారుజాము నుండి కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ సర్వర్లు మొరాయించడంతో సాయంత్రం వరకు కార్యక్రమం కొనసాగింది. ఆయా గ్రామాల్లో స్థానిక కూటమి నాయకులు ఎవరూ ఈ కార్యక్రమాలలో పాల్గొనకపోవడంతో హడావుడి లేకుండా ప్రశాంతంగా పింఛన్ల పంపిణీ సాగింది.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999